సాక్షి
కామారెడ్డి
సోమవారం । 12 । మే । 2025



మోడల్ కళాశాలలో..
మోడల్ కళాశాలల్లో ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- 8లో ▸



పొలాల్లో పశువుల మంద
పొలాల్లో పశువుల మందలను నిలవడం ద్వారా భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
40.7 /23.7
ఉదయం నుంచే ఎండతీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జవాన్ కుటుంబానికి అండగా ఉంటాం



మాచారెడ్డి : మావోయిస్టుల మందుపాతరకు బలైన గ్రేహౌండ్స్ జవాన్ వడ్ల శ్రీధర్ కుటుంబానికి అండగా ఉంటామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం పాల్వంచలో శ్రీధర్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నేతలు తోట బాల్‌రాజు, వెంకటరెడ్డి, అనిల్, సురేశ్ ఉన్నారు.

పెళ్లి పత్రికకు షష్టి పూర్తి

● 60 ఏళ్లనాటి పోచారం లగ్నపత్రిక



బాన్సువాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వైవాహిక జీవితంలోకి అడుగిడి అరవై ఏళ్లవుతోంది. 1965 మే 12న బాన్సువాడ మండలంలోని ఇబ్రాహీంపేట్‌కు చెందిన పుష్పవతితో ఆయన వివాహం జరిగింది. కాగా వీరి పెళ్లి పత్రికను పోచారం శ్రీనివాస్‌రెడ్డి బావమరిది ఇబ్రాహీంపేట్ మాజీ సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి ఫ్రేం కట్టించి భద్రపరచుకున్నారు.

గిరిజన గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లు

ఇందల్వాయి : రీజియన్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ గంగారాం నాయక్ తెలిపారు. మెదక్, చేగుంట, నర్సాపూర్, కోనాపూర్, ఎల్లారెడ్డి, హన్మాజీపేట, ఇందల్వాయి బాలికల జూనియర్ కళాశాల లో ఎంపీసీ, బైపీసీ సీట్లు, నర్సాపూర్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కొడిపల్లి, నాగిరెడ్డిపేట, భీమన్‌పల్లి బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ సీట్లు, బాన్సువాడలో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మొదట గిరిజన సంక్షేమ గురుకులాల్లో చదివిన విద్యార్థులతో సీట్లు భర్తీ చేశామని, మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 15న కామారెడ్డిలో బాలురకు, 16న చేగుంటలో బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

30 కిలోల మీనం



డొంకేశ్వర్ : ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఓ మత్స్యకారుడి వలకు బొచ్చ రకానికి చెందిన 30 కిలోల భారీ చేప చిక్కింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానం గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులు ఆదివారం గోదావరిలో చేపల వేటకు వెళ్లారు. భరత్ అనే మత్స్యకారుడికి భారీ చేప చిక్కింది. దీనిని వ్యాపారులకు విక్రయించాడు. ప్రతి వేసవిలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తగ్గి 20 నుంచి 30 కిలోల పైబడిన చేపలు మత్స్యకారులకు చిక్కుతున్నాయి.

నో ఫ్రైడ్!

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు స్వయం ఉపాధి పొందడం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీప్రైడ్ పథకం దరఖాస్తుదారులకు నిరాశే మిగిలింది. ఈ పథకం కింద జిల్లాలో 1,105 మంది దరఖాస్తు చేసుకోగా 347 మందికే సబ్సిడీ వచ్చింది. మిగతావారు ఏళ్ల తరబడిగా సబ్సిడీకోసం ఎదురుచూస్తున్నారు.



● టీప్రైడ్ పథకంలో సబ్సిడీకి బ్రేకులు
● జిల్లాలో 1,105 మంది దరఖాస్తు
● సబ్సిడీ వచ్చింది 347 మందికే
● ఏళ్లుగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

కామారెడ్డి క్రైం : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి ఆదుకునే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2016 లో టీప్రైడ్ (తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇంక్యూబేషన్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఇన్సెంటివ్ స్కీం) పథకాన్ని ప్రారంభించింది. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా, వాహనాలను కొనుగోలు చేయడం ద్వారా ఉపాధి కల్పించేలా అర్హులైన ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కోసం ఈ పథకాన్ని రూపొందించారు. 2024 వరకు పథకంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. కామారెడ్డి జిల్లాకు సంబంధించి కొందరికి మాత్రమే సబ్సిడీని మంజూరు చేసింది. ఆ తర్వాత ఈ పథకంలో పురోగతి కరువయ్యింది. వందల సంఖ్యలో లబ్ధిదారులు సబ్సిడీ అందక నిరాశలో ఉన్నారు. వాహనాలు ఓ వైపు పాతబడిపోతూ, గిరాకీలు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ప్రోత్సాహకంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రాక ఆర్థికంగా నలిగిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పెండింగ్‌లో రూ. 23 కోట్లు..

2016 నుంచి 2024 వరకు జిల్లాలో 1,105 మంది వివిధ కేటగిరీల్లో దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 347 మందికి మాత్రమే ప్రభుత్వం నుంచి సబ్సిడీ మంజూరైంది. మరో 758 మందికి ఎదురు చూపులే మిగిలాయి. జిల్లాకు ఇంకా రూ.23 కోట్లు సబ్సిడీ రావాల్సి ఉంది. 2020 జూలై నుంచి ఎస్టీలకు, 2021 మార్చి నుంచి ఎస్సీలకు సబ్సిడీ మంజూరు కావడం లేదు. సబ్సిడీ మంజూరు ఇచ్చిన వారికి సైతం నిధులు జమ చేయడం లేదు. దీంతో దరఖాస్తుదారులు నిత్యం కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. వ్యాపారాలు ఆశించినంతగా లేక, తీసుకున్న రుణాలకు వాయిదాలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాయిదాలు ఆలస్యం అయితే రుణాలు ఇచ్చిన కంపనీలు వాహనాలను జప్తు చేస్తున్నాయని, ఇంట్లో దాచుకున్న బంగారం అమ్మి వాయిదాలు కడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఉపశమనం లభిస్తుందంటున్నారు.

పలు రకాలుగా సబ్సిడీ..

టీప్రైడ్ పథకం 2016 లో ప్రారంభమైంది. దీంట్లో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 35 నుంచి 45 శాతం సబ్సిడీపై కార్లు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, పొక్లెయిన్‌లు, టిప్పర్‌లు, ఇతర వ్యవసాయ, వ్యాపార రంగాలకు సంబంధించిన వాహనాలు కొనుగోలు చేసి తద్వారా ఉపాధి పొందేలా అవకాశం కల్పించారు. లబ్ధిదారుడి వాటా, బ్యాంకు రుణం ద్వారా వాహనాలు కొనుగోలు చేశాక ప్రభుత్వం సబ్సిడీని విడుదల చేస్తుంది. రూ. 5 కోట్లలోపు ఏదైనా యూనిట్‌ను ఎంచుకోవచ్చు. కానీ సబ్సిడీ మాత్రం గరిష్టంగా రూ. 75 లక్షలు మాత్రమే వస్తుంది. వస్తువుల తయారీ పరిశ్రమల కేటగిరీ, ట్రాన్స్‌పోర్టు వాహనాల కొనుగోలు కేటగిరీల్లో మహిళలకు 45 శాతం, పురుషులకు 35 శాతం సబ్సిడీ అందించాలి.

రూ. 4.02 లక్షలు సబ్సిడీ రావాలి



టీప్రైడ్ పథకంలో సబ్సిడీ వస్తుందంటే ఆరేళ్ల క్రితం డ్రైవర్యం చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాం. కానీ ఇప్పటివరకు రూపాయి సబ్సిడీ కూడా రాలేదు. బ్యాంకు రుణం మొత్తం మేమే చెల్లించాం. సబ్సిడీ డబ్బులు రూ. 4.02 లక్షలు రావాల్సి ఉంది. వెంటనే సబ్సిడీ అందించాలి.
– సాలీబాయి, బొల్లారం తండా, నాగిరెడ్డిపేట

అప్పుల బారిన పడుతున్నాం



45 శాతం సబ్సిడీ వస్తుందంటే ఎనిమిదేళ్ల కింద ట్రాక్టర్ కొన్నాం. ప్రతినెలా వాయిదాలు కడుతున్నాం. సబ్సిడీ రూ. 3.84 లక్షలు ఇప్పటికీ రాలేదు. గిరాకీలు సరిగా లేని సమయాల్లో వాయిదాలు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. రాయితీ సొమ్ము మంజూరు చేయాలి.
– కెతావత్ శాంత, బాయంపల్లి, లింగంపేట్ మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం

పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ మంజూరు గురించి ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిధులు విడుదల కాగానే ప్రతి లబ్ధిదారుకు సబ్సిడీ మొత్తం జమ అయ్యేలా చూస్తాం.
– లాల్‌సింగ్, జీఎం, పరిశ్రమల శాఖ, కామారెడ్డి

ఎప్‌సెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సాందీపని కళాశాల యాజమాన్యం

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్‌సెట్(ఈఏపీసీఈటీ) ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాకేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో గోలివడ్ల నవదీప్ 3,433వ ర్యాంకు, సర్వత్ ఫాతిమా 3,850, సాయి రిశ్వితరెడ్డి 4,265, భాగ్యలక్ష్మి 6,001, మస్సిరా మలిహా 6,399, బిలాల్ 9,177, రిత్విక్ 9,965 ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో సీహెచ్ శివకార్తీక్ 6,979వ ర్యాంకు సాధించాడు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రతినిధులు బాలాజీరావు, సాయిబాబా, రాజశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.


అర్షపల్లి శ్రీశౌర్య


మామిళ్ల అక్షయ


ర్యాల తేజస్విని

బాన్సువాడ విద్యార్థులు..

బాన్సువాడ : ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో బాన్సువాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణానికి చెందిన అర్షపల్లి శ్రీశౌర్యకు 905 వ ర్యాంకు, మామిళ్ల అక్షయకు 1,855వ ర్యాంకు, ర్యాల తేజస్వినికి 3,419వ ర్యాంకు వచ్చాయి. తమ పిల్లలు మంచి ఫలితాలు సాధించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చినుకు పడితే వారసంత చిత్తడే



సదాశివనగర్ వారసంతలో నిలిచిన వర్షపు నీరు

సదాశివనగర్ : మండల కేంద్రంలోని వారాంతపు సంత ప్రాంతంలో సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. చినుకు పడితే ఆ ప్రాంతం అంతా చిత్తడిగా మారుతోంది. దీంతో కూరగాయలు, ఇతర సరుకుల విక్రేతలతోపాటు ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి సంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇనుప కూలర్లతో జర భద్రం

నాగిరెడ్డిపేట: ఎండలు తీవ్రమైన నేపథ్యంలో ప్రజలు ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఈ క్రమంలో కూలర్ల వాడకం పెరిగిపోయింది. పేద, మధ్యతరగతి కుటుంబాలు కూలర్లను విరివిగా వినియోగిస్తున్నారు. అయితే ఎక్కువగా ఇనుప కూలర్లను వాడుతున్నారు. తక్కువ ధరకే లభిస్తుండడంతో ఎక్కువగా వీటినే కొనుగోలు చేస్తున్నారు. వీటితో మరో ప్రయోజనం ఏమిటంటే బ్రాండెడ్ కూలర్లకన్నా ఇవి ఎక్కువ గాలిని ఇస్తాయి. దీంతోపాటు ఇళ్లలోని కిటికీల వద్ద అమర్చుకోవడానికి ప్లాస్టిక్ కూలర్ల కంటే ఇనుప కూలర్లే అనుకూలంగా ఉంటాయి. దీంతో ఎక్కువమంది ఇనుప కూలర్ల వాడకానికి మొగ్గు చూపుతున్నారు. అయితే వీటిని వాడడం ప్రారంభించిన కొంతకాలానికే తుప్పు పడుతుంటాయి. దీంతోపాటు కూలర్‌లోని విద్యుత్ వైర్లు దెబ్బతిని కూలర్ బాడీకి విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంటుంది. దీనిని గమనించక చాలామంది కూలర్లను అలాగే వినియోగించి విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో ఇద్దరు చిన్నారులు ఇనుప కూలర్లను తాకి విద్యుదాఘాతానికి గురై మరణించారు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఏడాది సైతం ఒకరు మృత్యువాతపడ్డారు. రెండు రోజుల క్రితం జుక్కల్ మండలం గుల్లతండాలో తల్లీకూతుళ్లు ఇనుప కూలర్‌తో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.



గుల్ల తండాలో తల్లీ కూతుళ్ల మరణానికి కారణమైన ఇనుప కూలర్

జాగ్రత్తలు పాటిస్తే మేలు..

ఇనుప కూలర్లను వినియోగించేవారు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా ఉండవచ్చు. ఇనుప కూలర్లను కొన్నవారు ఒక ఏడాదిపాటు వినియోగించాకా వాటిలోపలి భాగానికి కొత్తగా రంగు వేసుకోవాలి. దీంతోపాటు అందులోని విద్యుత్ తీగలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచేసుకోవాలి. కూలర్ ఆన్ చేసినప్పుడు కూలర్‌బాడీకి విద్యుత్ సరఫరా అవుతుందేమోనని చెక్ చేసుకోవాలి. విద్యుత్ సరఫరా అవుతున్నప్పుడు కూలర్ల సమీపానికి వెళ్లకపోవడం ఉత్తమం.

త్వరలోనే 'ప్రాణహిత'ను పూర్తి చేస్తాం

కామారెడ్డి టౌన్ : ప్రాణహిత – చేవెళ్ల పథకం 22వ ప్యాకేజీ పనులు త్వరలోనే పూర్తై, జిల్లాకు సాగునీరు అందుతుందని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలోగల ప్రాణహిత –చేవెళ్ల పైలాన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటాలకు కాంగ్రెస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాకు సాగు నీరందించేందుకు ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టు 22 ప్యాకేజీ పనులను ప్రారంభించారన్నారు. గత ప్రభుత్వ ఈ పనులను మరిచిపోయిందన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చొరవతో ప్రభుత్వం రూ. 22.15 కోట్లు మంజూరు చేసిందన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎంతోపాటు ప్రభుత్వ సలహాదారుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భీంరెడ్డి, సందీప్, కన్నయ్య, అన్వర్, గంగాధర్, శ్రీనివాస్ తదితరులున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎక్కడి నిల్వలు అక్కడే

● లారీల కొరతతో ఇబ్బందులు
● రైతుల్లో అకాల వర్షాల భయం
● రాత్రింబవళ్లు జొన్న కుప్పల వద్దే పడిగాపులు
● పట్టించుకోని అధికారులు

పెద్దకొడప్‌గల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు రైతన్న ఆపసోపాలు పడుతున్నాడు. నూర్పిళ్ల అనంతరం జొన్నలను కొనుగోలు కేంద్రాలకు తరలించగా సమయానికి కాంటా చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మరోవైపు లారీల కొరతతో కాంటా అయిన బస్తాల తరలింపులో జాప్యం ఏర్పడుతుండడంతో అకాల వర్షాలు కురిస్తే ఎక్కడ ధాన్యం తడిసిపోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నిలిచిన కాంటాలు..

పెద్దకొడప్‌గల్ మండలంలోని వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రానికి ఐదు రోజుల నుంచి లారీలు రాకపోవడంతో కాంటాలు నిలిచాయి. ఇప్పటికే వేల బస్తాలు కాంటా పూర్తయి తరలించడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిని తరలించకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది. వర్షం వచ్చినప్పుడల్లా జొన్నలపై టార్పాలిన్లు కప్పుతూ కాపాడుకుంటున్నారు. కాగా ఆయా గ్రామాల రైతులు వద్ద తరలింపునకు లారీల యజమానులకు ఎక్కువ డబ్బులు ఇస్తుండడంతో వారికే లారీలను కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లారీలను తెప్పించి బస్తాలను త్వరగా తరలించాలని రైతులు కోరుతున్నారు.



పెద్దకొడప్‌గల్ సొసైటీలో పేరుకుపోయిన జొన్న నిల్వలు

డబ్బులిస్తేనే లారీలు..



జొన్నలు తూకం వేసి పది రోజులవుతోంది. లారీలు రాకపోవడంతో ఇక్కడే ఉన్నాయి. ఇతర గ్రామాల రైతులు లారీల యజమానులకు బస్తాకు రూ. 30 నుంచి రూ.40 ల చొప్పున ఇస్తుండడంతో అక్కడికే వెళుతున్నాయి.
– బస్సి కిషన్, రైతు, పెద్దకొడప్‌గల్

16 రోజులైనా కొనుగోలు చేయలే



కొనుగోలు కేంద్రానికి జొన్నలు తెచ్చి 16 రోజులు దాటినా ఇంత వరకు కొనుగోలు చేయలేదు. రాశుల వద్దే పడిగాపులు కాస్తున్నాం. వర్షం వచ్చినప్పుడల్లా పట్టాలు కప్పలేక ఇబ్బందిపడుతున్నాం.
–గోండ శంకర్, రైతు, పెద్దకొడప్‌గల్

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

వరి, జొన్నలు ఒకేసారి రావడంతో బస్తాల తరలింపులో ఆలస్యమవుతోంది. వరి కొనుగోళ్లు పూర్తయ్యాయి. జొన్నల కొనుగోలు మిగిలింది. బస్తాలు తరలించేందుకు లారీలు వస్తున్నాయి. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. మా సొసైటీ పరిధిలో 58,072 క్వింటాళ్ల కొనుగోలు చేశాం. మరో 25వేల క్వింటాళ్ల జొన్నలు వచ్చే అవకాశం ఉంది.
– సందీప్, కార్యదర్శి, పెద్దకొడప్‌గల్ పీఏసీఎస్

గాలివాన బీభత్సం

వర్ని: ఉమ్మడి వర్ని మండలంలోని చందూర్, మోస్రా, వర్ని మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సుమారు అరగంటపాటు భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీయడంతో శ్రీనగర్ శివారులో భారీ వృక్షం రోడ్డుపై పడిపోయింది. రోడ్డు మధ్యలో చెట్టు పడిపోవడంతో రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, వాహనదారులు కలిసి రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగించడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి.

మొలకెత్తిన ధాన్యం

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండలంలోని పలుచోట్ల శనివారం రాత్రి వర్షం కురవడంతో పంట దిగుబడులు తడిసిముద్దయ్యాయి. నెలరోజులుగా ధాన్యం రోడ్డుపై ఆరబోస్తున్నానని, వర్షానికి తడిసి మొలకెత్తిందని ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన రైతులు పేర్కొన్నారు. బస్తాల్లోని ధాన్యం సైతం మొలకెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా మరో 15 రోజుల వరకు సజ్జ చేతికి వచ్చే అవకాశం లేదంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



శ్రీనగర్ శివారులో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

క్లుప్తంగా

బిచ్కుందలో జర్నలిస్టుల నిరసన

- ఏపీలో కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని..
- అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత



బిచ్కుంద(జుక్కల్): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కూటమి ప్రభుత్వం పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తుందని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షి దినపత్రిక ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపినందుకు ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసులతో సోదాలు చేయించి వేధింపులకు గురిచేయడం బాధకరమన్నారు. ఈవిషయంలో ఏపీ పోలీసుల తీరును నిరసిస్తూ ఆదివారం బిచ్కుందలో వర్కింగ్ జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ కళ్లు తెరపించాలని కోరుతూ ఆయన విగ్రహానికి వినతి పత్రం అందించామన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా సహాయక కార్యదర్శి జీ. వీరయ్య, జర్నలిస్టులు శంకర్ పటేల్, సంజీవ్, డీ శ్రీనివాస్, నాగరాజ్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, బీ.విఠల్, సుభాష్ జాదవ్, ప్రవీణ్, మోహసిన్, సుభాష్, అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): కూలీ పనులు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంకు చెందిన అంతోటి ఉపేంద్ర(47) భవన నిర్మాణ పనులు చేయడానికి కొన్ని రోజుల క్రితం లింగంపేట మండల కేంద్రానికి వచ్చాడు. వెంకటేశ్వర్‌రావు మేస్త్రీ వద్ద అతడు కూలీ పనులు చేస్తుండేవాడు. ఆదివారం ఉదయం అతడు అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. మేస్త్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. రఘునాథపాలెంలోని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఆదివారం ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు అయినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్ తెలిపారు. వివరాలు ఇలా.. తిర్మన్‌పల్లి గ్రామంలో బోనాలపండుగ నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామంలో ఉన్న ఎస్సీలకు ఇతర ప్రజలకు మాటమాట పెరిగి తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో తిర్మన్‌పల్లి గ్రామస్తుల ఎస్సీ, ఎస్టీ వర్గాల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మోడల్ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- ఈనెల 20 వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తులకు అవకాశం
- ఇంగ్లిష్ మీడియంలో బోధన
- జిల్లాలో 6 మోడల్ కళాశాలలు



బాలికల కోసం ఏర్పాటు చేసిన వసతిగృహం



ఎల్లారెడ్డిలోని మోడల్ కళాశాల

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఇంటర్మీడియట్‌లో ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవాలనుకునే బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మోడల్ కళాశాలలు వరంగా మారాయి. 2025- 2026 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

ప్రతి గ్రూపులో 40 మంది విద్యార్థులు....

జిల్లాలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, సదాశివనగర్, బాన్సువాడ,మద్నూర్‌లలో మోడల్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రతి గ్రూపులో 40 మంది విద్యార్థుల చొప్పున ఒక్కో కళాశాలలో 160 మంది విద్యార్థులకు అవకాశం లభించనున్నది.

జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం

మోడల్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఆన్‌లైన్‌లో ఈనెల 20 లోగా దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసిన అనంతరం సాఫ్ట్ కాపీని ఆయా కళాశాలలో అందించాలి. ఇంటర్మీడియట్ మెరిట్ జాబితాను ఈనెల 26న ప్రకటించడం జరుగుతుంది. ఈనెల 27 నుంచి 31 వరకు కళాశాలలో ఎంపికైన విద్యార్థుల ఒరిజినల్ ధృవపత్రాల పరిశీలన చేయడం జరుగుతుంది. అనంతరం ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ చేసుకుంటారు. జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం కానున్నాయి. మోడల్ కళాశాలలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఆంగ్ల మాధ్యమంలో చదువుకునే ఆసక్తి గల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న మంచి అవకాశం.

బాలికలకు ఉచిత వసతి

మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చదివే విద్యార్థినులకు ప్రభుత్వం హాస్టల్ వసతిని కల్పిస్తుంది. కళాశాలకు 5 కిలో మీటర్ల దూరం నుంచి వచ్చే విద్యార్థినులకు ఇబ్బంది కలుగకుండా 100 మంది విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ సౌకర్యాన్ని అందిస్తోంది.

విద్యార్థులకు రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు

కేటగిరి	సీట్లశాతం	సీట్లు	బాలురు	బాలికలు
జనరల్	50	20	13	07
ఎస్సీ	15	06	04	02
ఎస్టీ	06	02	01	01
బీసీ ఏ	07	03	02	01
బీసీ బీ	10	04	03	01
బీసీ సీ	01	00	00	00
బీసీ డీ	07	03	02	01
బీసీ ఈ	04	02	02	00

దివ్యాంగులకు 3శాతం

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్మీయట్‌లో చదువుకునేందుకు ఈనెల 20 లోగా దరఖాస్తులు చేసుకోవాలి. మెరిట్ ప్రకారం సీట్లను కేటాయించడం జరుగుతుంది.

– తోటగాంధీ, ప్రిన్సిపాల్, మోడల్ కళాశాల, ఎల్లారెడ్డి

ఆగని ఇసుక అక్రమ రవాణా

- టిప్పర్‌లతో పక్క రాష్ట్రాలకు తరలింపు
- మద్నూర్ ఉమ్మడి మండలంలోని మంజీర వాగులో ఇసుకను తోడేస్తున్న అక్రమార్కులు



మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టిప్పర్‌లు (ఫైల్)

మద్నూర్(జుక్కల్): అధికారులు, పోలీసులు అనుమతులు లేని ఇసుక వాహనాలను పట్టుకుంటున్న అక్రమార్కులు మాత్రం రాత్రి వేళల్లో తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. మద్నూర్ ఉమ్మడి మండలంలోని కుర్లా, సిర్‌పూర్ ప్రాంతాల్లోని మంజీర వాగులోంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో టిప్పర్, ట్రాక్టర్‌లలో ఓవర్ లోడ్‌తో ఇసుకను నింపి తరలిస్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు అక్రమ ఇసుక టిప్పర్, ట్రాక్టర్‌లను పట్టుకోని కేసులు నమోదు చేస్తున్న అక్రమార్కులు మాత్రం వెనక్కితగ్గడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మంజీర నది నుంచి ఇసుకను లోడ్ చేసి మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్, పెద్ద ఎక్లార మీదుగా కర్ణాటక, మహారాష్ట్రలకు తరలిస్తున్నారు. మంజీరాలో ఇసుకను తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అంతరించే పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇసుక తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సంబంధిత వాహనాలను పట్టుకోని మైన్స్ అధికారులకు అప్పగిస్తున్నాం. అలాగే అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలపై కేసులు సైతం నమోదు చేస్తున్నాం. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశాం.

– విజయ్ కొండ, ఎస్సై, మద్నూర్

కవర్లు సరే.. మొక్కలేవీ..?

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలను నామమాత్రంగా ఏర్పాటు చేశారు. నర్సరీకి ఆదరణ కరువై కవర్లలో మొక్కలు లేకుండానే మట్టి పోసి వదిలేశారు. ఇతర గ్రామాలతో పోలిస్తే ఇక్కడ మొక్కల పెంపకం కానరావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బొప్పాస్‌పల్లిలో మట్టి పోసి వదిలేసిన కవర్లు

క్రైం కార్నర్

ఇరువర్గాల ఘర్షణ: పలువురికి గాయాలు

- సమాచారం ఇచ్చినా స్పందించని పోలీసులు



వర్ని: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఇరు వర్గాల మధ్య ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఘర్షణపై పోలీసులకు సమాచారం ఇచ్చిన స్పందించలేదని స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. వర్నిలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈఘటనపై ఇరువురి వాహనదారుల మధ్య మాటామాట పెరిగి చివరికి అంతాపూర్, తగిలేపల్లి గ్రామస్తుల మధ్య ఘర్షణగా మారింది.సుమారు గంటన్నరపాటు ఇరువర్గాలు తోపులాట, తిట్టుకోవడం, కొట్టుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సుమారు గంటన్నర నుంచి పోలీసులకు, డయల్ 100కు ఫోన్ చేసిన స్పందించలేదని స్థానికులు మండిపడుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు నిఘా వేయగా ట్రాక్టర్ పట్టుబడింది. ఈ ట్రాక్టర్‌ను కోటగిరి పోలీస్‌స్టేషన్ తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్ గ్రామానికి చెందిన బండిసాయిలు అనే రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాయిల్ చోరీచేశారు. సుమారు రూ.40వేల నష్టం వాటిల్లిన ట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం వరికోతలు పూర్తికావడంతో రైతులు పొలాలవైపు వెళ్లకపోవడంతో దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవీపేట: నిజామాబాద్ నుంచి ధర్మాబాద్ వైపు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. టాటాఏస్ వాహనంలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో నవీపేట శివారులో పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మహేష్‌కుమార్‌కు అప్పగించామన్నారు. నిజామాబాద్‌లోని మాలపల్లికి చెందిన వాహన యజమాని షేక్ ఖయ్యూమ్, డ్రైవర్ సొఫియాన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ శివారులోగల తోట గణేష్ అనే వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమయింది. వడదెబ్బ తగిలి సుమారు రెండు మూడు రోజుల క్రితమే అతడు మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, కాఫీ కలర్ టీషర్టు ఉన్నదని, సంబంధీకులు ఎవరైన ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదం కాదు.. హత్యే..

- భర్తను ప్రియుడితో కలిసి హతమార్చిన భార్య
- దాబా పైనుంచి పడి చనిపోయాడని నమ్మించిన వైనం
- కుమారుడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

మాక్లూర్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భావించి భర్తను ప్రియుడితో కలిసి భార్య హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొదట దాబా పైనుంచి పడి చనిపోయాడని నమ్మించి అంత్యక్రియలు పూర్తి చేయగా, కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టగా హత్య విషయం తెలిసింది. కేసు వివరాలను ఆదివారం నార్త్ జోన్ సీఐ శ్రీనివాస్ మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ వెల్లడించారు. మాక్లూర్ మండలం కల్లెడి తండాలో ఈ నెల 5న రాత్రి గూగులోత్ శంకర్ దాబా పైనుంచి పడి మృతి చెందాడని భార్య యమున నమ్మించింది. మరుసటి రోజు అంత్యక్రియలు సైతం పూర్తిచేశారు. ఈ విషయమై మృతుడి కుమారుడు గూగులోత్ రమేష్ తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఈనెల 10 మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాజశేఖర్ వెంటనే విచారణ ప్రారంభించి యమునను అదుపులోకి తీసుకుని విచారించగా, హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. 5వ తేదీ రాత్రి తన ప్రియుడు నందుతో కలిసి భర్త శంకర్‌ను దాబా పైనుంచి తోసివేసింది. అనంతరం కర్రతో కొట్టి గొంతు నులిమి హత్య చేశారు. దీంతో భార్య, ఆమె ప్రియుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రణీత మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలోగల 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కంఠం గ్రామానికి చెందిన అముల్ నేవీలో విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సెలవులు రద్దు కావడంతో భార్య బోయర్ ప్రణీత(19)తో కలిసి ఆదివారం సాయంత్రం కారులో విశాఖపట్నం బయలుదేరాడు. అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో వీరి వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రణీతకు తీవ్ర గాయాలు కాగా అముల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రణీత మృతి చెందింది. అముల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని గుడ్ల ప్రవీణ్(35) పుసవర్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగ వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు అయినట్లు శనివారం భార్యకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత గాలించిన అతడి ఆచూకీ తెలియలేదు. ఆదివారం ఉదయం రాజారాం నగర్ స్మశాన వాటికలో చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బోనాల్ గ్రామానికి చెందిన యువతి..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కుచలకంటి సుచరిత(22) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని గండిమైసమ్మ ప్రాంతానికి వెళ్లి నివాసం ఉంటున్నారు. గత కొంతకాలం క్రితం సుచరిత తల్లిదండ్రులు స్వగ్రామం బోనాల్‌కు తిరిగి వచ్చారు. సుచరిత అక్కడే ప్రయివేటు కంపెనీలో పని చేసుకుంటూ ఉంటుంది. శనివారం రాత్రి సుచరిత నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా, స్థానికులు ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు హైదరాబాద్‌కు వెళ్లి కూతురు మృతదేహాన్ని చూసి, బోరున విలపించారు. సుచరిత ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం అని తెలిసింది. సుచరిత ఆత్మహత్యకు కారణమైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఎప్‌సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల సత్తా



ఉత్తమ విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం

నిజామాబాద్‌అర్బన్: ఎప్‌సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఫలితాలు విడుదల కాగా, పలువురు విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన హర్షిత్‌కు అగ్రికల్చర్ విభాగంలో 1314 ర్యాంకు, నిహాల్‌కు 2553 ర్యాంకు వచ్చింది. పదివేల లోపు పదిర్యాంకులు, 20వేలలో పు 26 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు ఏజీఎం లక్ష్మారెడ్డి అన్నారు.

కాకతీయ కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులు అనస్‌అలీ 1766 ర్యాంకు(అగ్రికల్చర్), ఎం.సంకీర్త్ 2398 , జి.వేదస్కర్ 2881, భవ్యశ్రీ 3310, ఎం.లోకేశ్ 3671, ఏ.వైష్ణవి 4172, రిషిక్ 5932, వి.నికేతన్ 6293 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ రామోజీరావు సన్మానించారు. కళాశాల డైరెక్టర్ తేజస్విని, ప్రిన్సిపల్ సందీప్, రణదీప్, శ్యామ్ పాల్గొన్నారు.



అనస్‌అలీ 1766 ర్యాంకు



ఎం సంకీర్త్ 2398 ర్యాంకు



జి వేదస్కర్ 2881 ర్యాంకు

ఎస్ఆర్ కళాశాలలో..

నగరంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు కార్తీక్ 572 ర్యాంకు, విష్ణువర్ధన్ 689 ర్యాంకు (అగ్రికల్చర్), అతీఫ్‌అఫ్నాన్ 1305 (అగ్రికల్చర్), నవదుర్గ 1484 (ఇంజనీరింగ్), శ్రీకాంత్ 1611(అగ్రికల్చర్), తేజస్విని 1914(అగ్రికల్చర్), జి.సిరి 2117(అగ్రికల్చర్), రాజశ్రీ 2175 ర్యాంకు (అగ్రికల్చర్) సాధించారు. విద్యార్థులను కళాశాల ఏజీఎం గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.


వెక్టార్ జూనియర్ కళాశాలలో..

నగరంలోని వెక్టార్ జూనియర్ కళాశాల విద్యార్థులు శ్రీవర్షిణి 1316 ర్యాంకు, మామిడి నిశాంత్‌రెడ్డి 1737, చంద్రవన్‌రెడ్డి 2532, వినాయక్ జోషి 2660, ఆర్గుల్ వెన్నెల 3554 ర్యాంకు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ మధుసూదన్‌జోషి అభినందించారు.

క్షతియ జూనియర్ కళాశాలలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాల విద్యార్థులు వివేక్‌రెడ్డి 1,813 ర్యాంకు (ఇంజనీరింగ్), హరివర్ధిని 3,724 ర్యాంకు (అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ) సాధించినట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్ రావు తెలిపారు.

పెన్షన్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు



నిజామాబాద్ నాగారం: పెన్షన్ ప్రభుత్వ భిక్ష కాదని, ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, దానిని కాలరాసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఇన్సూరెన్స్ ఉద్యోగుల జాతీయ నాయకుడు జీ తిరుపతయ్య అన్నారు. ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ అండ్ సీనియర్ సిటిజన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఈపీఎస్, న్యూ పెన్షన్ స్కీం, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, కొత్త పెన్షనర్లు, పాత పెన్షనర్లంటూ వర్గీకరించి పెన్షన్‌ను ఎగవేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మికులు పోరాటం చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ నెల 20న సమ్మెకు పూనుకున్నట్లు తెలిపారు. జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్, స్టడీ సర్కిల్ జిల్లా కన్వీనర్ రామ్మోహన్‌రావు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటేశ్ , ఈవిల్ నారాయణ, నేతి శేఖర్, శ్రీనివాసరావు, విజయానందరావు, ఎల్ శ్రీధర్, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల తర్వాత కలిసిన బాల్య మిత్రులు

- జిల్లాలో పలుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన పూర్వ విద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికిలోనైన స్నేహితులు



దోమకొండ జెడ్పీహెచ్ఎస్ 1994-95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: చిన్ననాటి మిత్రులందరూ దశాబ్దాల తర్వాత మళ్లీ ఒక్కచోటికి చేరడంతో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



తలమడ్ల జెడ్పీహెచ్ఎస్ 2010-11 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



గోపాల్‌పేట జెడ్పీహైస్కూల్ 2001-02 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



2010-11 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు